టీజీపీజీ సెట్‌లో సతీశ్‌కు 6వ ర్యాంకు



బొంరాస్‌పేట్, జూన్ 19: దుద్యాల మండలంలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన వడ్ల సతీశ్ టీజీపీజీ సెట్‌లో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సతీశ్ రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్థులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

ఎండిన మొక్కలే వికసించెలే..!





ఆకులు రాలి మొక్కలు ఎండి మోడుగా మారాయి. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వానలకు అవి చిగురించి పచ్చగా మారాయి. కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ పీహెచ్‌సీ ఆవరణలో గత హరితహారంలో నాటేందుకు మొక్కలు తెచ్చారు. వర్షాలు పడకపోవడంతో వాటిని అలాగే వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అవి చిగురించి పచ్చగా మారాయి.

కొడంగల్ రూరల్, జూన్ 19

సమస్యల ఒడి.. సర్కారు బడి!

ప్రభుత్వ బడులు సమస్యల్లో కునారిల్లుతున్నాయి. ఇక్కడ విద్యార్థులకు సదుపాయాలు లోపించాయి. పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో కొన్నిచోట్ల పంచాయతీ కార్యాయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అనుకున్న ఫలితాలు రావడం లేదు. ప్రభుత్వ స్కూళ్లపై నిత్యం పర్యవేక్షించాల్సిన వ్యవస్థ కూడా పటిష్టంగా లేకపోవడం కూడా దుస్థితికి కారణం అవుతోంది. దీంతో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షించే ఎంఈవో, డిప్యూటీ డీఈవో వంటి పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉంటున్నాయి.

- నిరుపయోగంగా మరుగుదొడ్లు.. బాలికల ఇబ్బందులు
- రంగారెడ్డి జిల్లాలో ఒకే ఒక్క రెగ్యులర్ ఎంఈవో
- డిప్యూటీ డీఈవో, రెగ్యులర్ ఎంఈవోలు లేక కొరవడిన పర్యవేక్షణ
- రూ. వేల కోట్లు వెచ్చిస్తున్నా సౌకర్యాలు అంతంత మాత్రమే
- మూన్నాళ్ల ముచ్చటగా బ్రేక్‌ఫాస్ట్ పథకం
- రోజురోజుకూ పడిపోతున్న ప్రమాణాలు
- సర్కారు బడులపై సన్నగిల్లుతున్న నమ్మకం
- ప్రైవేట్ బడులను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు



పరిగి మున్సిపాలిటీ మల్లెమోనిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో పగుళ్లు వచ్చిన గదులు

శిథిలావస్థలో భవనాలు.. భయం గుప్పిట్లో విద్యార్థులు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/ మేడ్చల్, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయి. భావి పౌరులను తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం ఏటా రూ.వేల కోట్లు వెచ్చిస్తున్నా బూడిదలో పోసిన పన్నీరే అవుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వంటి కారణాలు ఈ దుస్థితికి దారి తీస్తున్నాయి. విద్యా ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షించే ఎంఈవో, డిప్యూటీ డీఈవో పోస్టులు ఏళ్లుగా ఖాళీగా ఉంటున్నాయి. రంగారెడ్డి జిల్లాలో 'మన ఊరు-మన బడి'లో భాగంగా మొదటి విడత 464 పాఠశాలలు ఎంపిక చేశారు. 448 పాఠశాలలకు రూ.97.88కోట్లు మంజూరు చేసినా పనులు పూర్తి స్థాయిలో కాలేదు. ఈ సారి అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మొదటి విడత 423 పాఠశాలలను ఎంపిక చేశారు. తాగునీరు, విద్యుద్దీకరణ, చిన్న మరమ్మతులు, మూత్రశాలల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా పనులు వివిధ దశల్లోనే ఉన్నాయి. పర్యవేక్షణ లోపంతో పురోగతి లేదు. వికారాబాద్ జిల్లాలో 'మన ఊరు-మన బడి' కింద 371 బడులను ఎంపిక చేశారు. రూ.23కోట్లతో 45 పాఠశాలల్లో కొన్ని పనులు చేసి మమ అనిపించేశారు. ఇప్పుడు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద 1,064 పాఠశాలల్లో పనులు చేపట్టగా 600పాఠశాలల్లో పనులు పూర్తి చేసినట్లు సమాచారం.

శిథిల భవనాల్లో బోధన

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ బడులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. చేవెళ్ల మండలం దేవరాంపల్లి ప్రైమరీ పాఠశాల శిథిలావస్థకు చేరింది. దీంతో రెండేళ్లుగా విద్యార్థులను పంచాయతీ కార్యాలయంలో పాఠాలు బోధిస్తున్నారు. పంచాయతీ మీటింగ్ సమయంలో పిల్లలను చెట్లకింద కూర్చోబెడుతున్నారు. అద్దె బిల్డింగ్‌లోకి మార్చాలని కలెక్టర్ ఆదేశించగా అంగన్‌వాడీ భవనంలోకి షిఫ్ట్ చేశారు. వికారాబాద్‌లోని జడ్పీ బాలుర పాఠశాల వర్షం కురిస్తే తరగతి గదులు జలమయమవుతాయి. వరండా ప్రమాదకరంగా మారింది. పైకప్పు కూలి పడే పరిస్థితులు ఉన్నాయి. పరిగి మునిసిపల్ పరిధిలోని మల్లెమోనిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో 74 మంది విద్యార్థులకు నలుగురే ఉపాధ్యాయులు ఉన్నారు. కిటికీలకు తలుపుల్లేవు. గోడలకు పగుళ్లొచ్చాయి. పైకప్పు పెచ్చులూడింది. బేస్మెంట్ పగుళ్లు వచ్చాయి. ఇటీవల పెచ్చు పిల్లల మధ్య పడింది. పెద్దేముల్ మండలం, మదనంతాపూర్ తండాలో పాఠశాల భవనం శిథిలం కావడంతో కమ్యూనిటీ భవనంలో పిల్లలకు పాఠాలు బోధిస్తున్నారు. తాండూరు మండలం, జినుగుర్తి గేటు వద్ద ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్‌లో వంట గది శిథిలావస్థకు చేరుకోవడంతో వంట చేయడం ఇబ్బందికరంగా మారింది. యాలాల్ మండల పరిధిలోని గంగాసాగర్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే తరగతి గదుల్లోకి నీరు చేరుతోంది.



ఇన్‌చార్జి ఎంఈవోలతో లోపిస్తున్న పర్యవేక్షణ

రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలుండగా హయత్‌నగర్ మండలానికే రెగ్యులర్ ఎంఈవో ఉన్నారు. మిగతా ఎంఈవోలంతా ఇన్‌చార్జిలే. సీనియర్ హెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలప్పగించారు. ఒక్కో ఎంఈవోకు మూడు నాలుగు మండలాలను అప్పగించారు. దీంతో వారు ఏ మండలానికీ న్యాయం చేయకపోతున్నారు. జిల్లాకు డిప్యూటీ డీఈవో పోస్టు లేదు. డీఈవో ఒక్కరే ఉండటంతో ఆయనపై పర్యవేక్షణ భారం ఎక్కువైంది. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా ఇన్‌చార్జి ఎంఈవోలే ఎక్కువగా ఉన్నారు.



వికారాబాద్ ఉన్నత పాఠశాలలో ప్రమాదకరంగా వరండా పైభాగం

అరకొర వసతులు.. అవస్థల్లో విద్యార్థులు

ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు అవస్థలు పడుతున్నాయి. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో తాగునీటి సౌకర్యం లేక ఇంటి నుంచే విద్యార్థులు నీటిని తెచ్చుకుంటున్నారు. శంకర్‌పల్లి ఉర్దూ మీడియం పాఠశాలలో మరుగుదొడ్లలో నీరు లేక విద్యార్థులు బకెట్లలో నీటిని తెచ్చుకుని కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. వికారాబాద్ జిల్లాలో 930 పాఠశాలల్లో మరమ్మతులతో పాటు కనీస సదుపాయాల కల్పన పనులు చేపట్టగా వాటిలో చాలావరకు తుది దశలో కొనసాగుతున్నాయి. దోమ మండలం, ఊటుపల్లి జడ్పీ ఉన్నత

మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో పాఠశాలల వివరాలు

పాఠశాలలు	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
ప్రాథమిక	881	776	375
ప్రాథమికోన్నత	180	111	22
ఉన్నత	248	176	108

టార్గెట్ 286...పూర్తయినవి 60 మాత్రమే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు ప్రారంభమైనప్పటికీ అవి అరకొరగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు- మనబడి పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. 176 పాఠశాలలు ఎంపిక కాగా అందులో దాదాపు 60 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో జిల్లాలో 286 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 515 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. పనులు వేగవంతం అవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించినా నిధుల లేమితో నత్తనడకన కొనసాగిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో టెండర్లు పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదు. ధర గిట్టుబాటు కానందునే పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది.

మూన్నాళ్ల ముచ్చటగా బ్రేక్‌ఫాస్ట్ పథకం

బ్రేక్‌ఫాస్ట్ పథకం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని 2023 అక్టోబరు 6న మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలలో నాటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. జిల్లాలో 1,306 పాఠశాలల్లో 1,43,500 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరాలనే ఉద్దేశంతో ప్రారంభించినప్పటికీ.. అమలు కావడం లేదు. మెను ప్రకారం ఎక్కడా అమలు కావడం లేదు. మేడ్చల్, వికారాబాద్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.



బషీరాబాద్ సీపీఎస్ పాఠశాలలోని తరగతి గదిలో వంట



పెద్దేముల్ : మదనంతాపూర్‌తండాలో శిథిలమైన పాఠశాల భవనం



పరిగి : శిథిలావస్థలో మల్లెమోనిగూడ పాఠశాల భవనం



తూంకుంట ఉన్నత పాఠశాలలో ఆగిపోయిన పనులు



బషీరాబాద్ సీపీఎస్‌లో అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం



కొడంగల్‌లో ఈదురు గాలులకు లేచిపోయిన వంట గది రేకులు

తల్లీకూతుళ్లను చిదిమేసిన లారీ

- తాండూరు కాగ్నానది శివారులో ఘటన

యాలాల, జూన్ 19: లారీ బైకును ఢీకొట్టడంతో తల్లీకూతురు చనిపోయారు. తండ్రి, కుమారుడు గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ అంతకుముందే మరో బైకును ఢీకొట్టింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం తాండూరు కాగ్నా నది శివారులో జరిగింది. బంట్వారం మండలం సల్‌బత్తాపూర్ గ్రామానికి చెందిన కోస్గి నర్సింహులు, భార్య అనిత (25), కూతురు చిట్టి (1), కుమారుడితో కలిసి యాలాలలోని ఆధార్ కేంద్రానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి గ్రామానికి బైకుపై వస్తుండగా మార్గమధ్యలో కాగ్నానది బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ బైకును ఢీకొట్టింది. బైకు వెనక కూర్చున్న అనిత, చిట్టి కింద పడి పోయారు. చిట్టి తలపై నుంచి లారీ దూసుకెళ్లడంతో పాటు అనిత తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. తండ్రీకొడుకు గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి కారణమైన లారీ అంతుకు ముందు బాలరాజు, లక్ష్మీ దంపతులు ప్రయాణిస్తున్న బైకును ఢీ కొట్టడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. యాలాల పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్, జూన్ 19: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కడా కింద మంజూరైన నిధులతో చేపట్టాల్సిన పనులను వేగవంతం చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ఇరు జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు తమ శాఖలకు నిర్ధేశించిన పనులకు ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలన్నారు. మంజూరైన పనులకు టెండర్ల ప్రక్రియను వేగవంతం చేసి పనులు చేయాలని సూచించారు. రోడ్డు విస్తరణకు సంబంధించి పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ శాఖల ఇంజనీర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదే విధంగా వివిధ కళాశాలల నిర్మాణానికి భూ సేకరణ చేపట్టాలని, భూసేకరణ విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొడంగల్‌లో నిర్మించే అతిథి గృహానికి సంబంధించి నమూనాను రూపొందించి టెండర్లకు పిలవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల నిర్మాణాల నమూనాలు, వైద్యుల నియామకానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గృహజ్యోతి పథకం కింద దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించే దిశగా పని చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు అందించాలన్నారు. నీటి ట్యాంకుల నిర్మాణాలకు, పైపులైన్‌ల పనుల నిమిత్తం అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. చెక్ డ్యాంల నిర్మాణ పనులపై, అటవీ శాఖ భూముల్లో జరుగుతున్న పనులపై కలెక్టర్ సంబంధిత అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించిన గురుకుల పాఠశాలలు స్థానికంగా ఉండేలా, వసతి గృహల నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టి వివిధ సంక్షేమ శాఖలకు కేటాయించాలని తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌కు సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బొకేలు శాలువాలతో కాకుండా... పెన్నులు, పుస్తకాలతో కలవాలి

వికారాబాద్ : బొకేలు శాలువాలతో కాకుండా పెన్నులు, పుస్తకాలతో కలవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. వికారాబాద్ జిల్లాకు నూతన కలెక్టర్‌గా వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు శాలువాలు,బొకేలతో వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను కలవడానికి వస్తున్న వారు శాలువాలు, బొకేలతో కాకుండా పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నోటుపుస్తకాలు, పెన్నులు ఇతర స్టేషనరీతో రావాలని కోరారు




మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సుధీర్

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

నవాబుపేట, జూన్ 19: విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జడ్పీ సీఈవో సుధీర్ అన్నారు. బుధవారం నవాబుపేట మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు తదితర సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అనురాధ, సూపరింటెండెంట్ అజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాండూరు, జూన్ 19 : చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణ ఏజెన్సీలకు నిర్వహించిన బహిరంగ వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. బుధవారం తాండూరు మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో నిర్వహించిన వేలంలో ఐదుగురు పాల్గొన్నారు. కొడంగల్ ప్రాంతానికి చెందిన వ్యాపారి ఎంటీ.రఫీ









వ్యర్థాల సేకరణ వేలానికి భారీ స్పందన

రూ.30.35 లక్షలకు వేలం పాడి వ్యర్థాల సేకరణ హక్కును దక్కించుకున్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశానుసారం చైర్‌పర్సన్, కౌన్సిలర్ల సహకారంతో వేలాన్ని నిర్వహించారు. టెండర్ దక్కించుకున్న వ్యాపారి తాండూరు మున్సిపాలిటీలో చికెన్, మటన్, చేపల మాంసం వ్యర్థాలను సేకరించి కంపెనీలకు తరలించాలి. వేలంలో తాండూరు, పరిగి, కొడంగల్, గద్వాల ప్రాంత వ్యాపారులు పాల్గొన్నారు. వేలం హక్కు జూలై 1 నుంచి మార్చి 31 వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. టెండర్ దారుడు మున్సిపాలిటీకి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో టెండర్ ప్రక్రియ నిర్వహించినా అప్పట్లో కంపెనీలపై ఫిర్యాదులు రావడంతో వేలాన్ని వాయిదా వేశారు. మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి ఆధ్వర్యంలో వేలాన్ని నిర్వహించారు.


వేలం నిర్వహిస్తున్న మునిసిపల్ అధికారులు

ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్‌లకొస్తే కల్లోలం సృష్టిస్తాం

నవాబుపేట, జూన్ 19: చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలోకి వస్తే కల్లోలం సృష్టిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య అన్నారు. బుధవారం నవాబుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవేళ్ల బీ-బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్, కోఆప్షన్, ఎంపీటీసీ టికెట్లను ఎమ్మెల్యే యాదయ్య అమ్ముకున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ సామ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి యాదగిరి, నాయకులు సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, బందెయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నకిలీ డాక్యుమెంట్లపై చర్యలు చేపట్టాలి

ఘట్‌కేసర్, జూన్ 19 : ఘట్‌కేసర్ రెవెన్యూలోని సర్వే నంబర్లు 244, 245, 248, 288లలోని దత్తాత్రేయ వెంచర్‌లో నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ సంగీతాప్రభాకర్‌రెడ్డి బుధవారం ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ జగన్‌మోహన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దత్తాత్రేయనగర్‌లోని ప్లాట్ నంబర్లు 96, 411, 421, 485లకు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని తెలిపారు. ఇలాంటి మోసాలు ఇంకా అనేకం జరిగాయని, ఈ లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్లకు వచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించాలని కోరారు. ఒక్కోప్లాటు ధర లక్షల్లో ఉందని, ఈ విషయం తెలియని అమయకులు ప్లాట్లు కొని మోసపోతున్నారని వివరించారు. నకిలీ డాక్యుమెంట్ల తయారీ ముఠాతో రియల్ బ్రోకర్ల హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నిఘాపెట్టి నకిలీ డాక్యుమెంట్ల తయారీ ముఠాను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.


సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ సంగీతారెడ్డి

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ధారూరు, జూన్ 19: పెండింగ్ వేతనాలు చెల్లించాలని బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీకార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల 5నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా కల్పించాలన్నారు. సమస్యలపై ఈ నెల 25న కలెక్టరేట్ ముట్టడిని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎంపీవో షఫీఉల్లాకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవికుమార్, అశోక్, మల్లేశం, పెంటయ్య, అనంతయ్య, గోపాల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, జూన్ 19: బషీరాబాద్‌లోని జూనియర్ కళాశాలలో ప్రవేశానికి బాల, బాలికల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.నర్సింహరెడ్డి తెలిపారు. జడ్పీ బాలుర పాఠశాల భవనంలో కొత్తగా కాలేజీని ఏర్పాటు చేస్తున్నమన్నారు. ఇంటర్‌లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సులుంటాయన్నారు. ఈ నెల 30లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎన్ఎస్‌యూఐ సిగ్నేచర్ క్యాంపెయిన్


మేడ్చల్ టౌన్, జూన్ 19: నీట్ విద్యార్థులకు న్యాయం జరగాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు. నీట్ పరీక్ష రాసిన విద్యార్థులకు మార్కుల విషయంలో న్యాయం జరిగేంత వరకు ఎన్ఎస్‌యూఐ అండగాఉంటుందని నేతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్‌యూఐ కార్యదర్శి రాకేష్, శ్రీధర్, వరుణ్‌రెడ్డి, శశి, విజయ్ పాల్గొన్నారు.














విధుల పట్ల అసత్వం వహిస్తే చర్యలు తప్పవు

నవాబుపేట, జూన్ 19: విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జడ్పీ సీఈవో సుధీర్ అన్నారు. బుధవారం నవాబుపేట మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు తదితర సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అనురాధ, సూపరింటెండెంట్ అజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్సార్ ప్రొఫెసర్లుగా గోపాలకృష్ణ గాంధీ, సాయినాథ్‌ల నియామకం

శామీర్‌పేట, జూన్ 19 : శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్శిటీ ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణ గాంధీ, మెగసెసె అవార్డు గ్రహిత సాయినాథ్‌లు నియమితులయ్యారు. గోపాలకృష్ణ ప్రజాపాలనరంగం, దౌత్యరంగంలోను, పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా, తదితర ఉన్నత బాధ్యతలు నిర్వహించారు. అలాగే ప్రొఫెసర్ సాయినాథ్ 2007లో రామన్ మెగసెసె అవార్డుతో పాటు 60కి పైగా జాతీయ, అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా నల్సార్ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ కృష్ణదేవరావు మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో మేధావుల బోధనల ద్వారా చట్టమనేది కేవలం సాంకేతిక విషయంపై అధ్యయనం మాత్రమే కాదని, విద్యార్థులకు సామాజిక, ఆర్థిక న్యాయానికి లోతైన ప్రశ్నలు, అంశాలను అందించడం అవసరమని ఆయన వెల్లడించారు.

సమస్యల ఒడి.. సర్కారు బడి!



వికారాబాద్ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

(ఐదో పేజీ తరువాయి)

పాఠశాలలో 8వ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. తరగతి గదుల కొరత నెలకొంది. వికారాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు సైతం మరమ్మతులకు నోచుకోవడం లేదు. మోమిన్‌పేట్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఉండగా, 150 మంది విద్యార్థులకు 12 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న మెట్లకుంట ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి అధ్వానంగా మారింది. ఈ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులున్నారు. ప్రాథమిక పాఠశాల పురాతన భవనాన్ని ఇటీవల మరమ్మతులు చేసి పైకప్పు వేసినా ఎత్తు పెంచకపోవడం, కిటికీలు లేకపోవడంతో సరైన వెలుతురు రాక విద్యార్థులు చీకట్లో విద్యను అభ్యసించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల ఈదురు గాలులకు వంట గది రేకులు లేచిపోయినా మరమ్మతులు చేయలేదు. విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

సమస్యగా మారిన అపరిశుభ్రత..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. బడుల్లో స్వీపర్లు, అటెండర్లను లేకపోవడంతో పారిశుధ్య సమస్యలు నెలకొంటున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత అతి పెద్ద సమస్యగా మారింది. ప్రభుత్వ పాఠశాలలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ఆ బాధ్యత స్థానిక సంస్థలదేనంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిస్థితుల్లో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. సర్కారు బడుల పరిశుభ్రత బాధ్యతలను స్థానిక సంస్థలకు అప్పగించారు. చిన్న గ్రామ పంచాయతీల్లో పరిస్థితి ఎలా ఉన్నా..మేజర్ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మాత్రం పారిశుధ్య కార్మికులు తక్కువగా



పెద్దేముల్: కమ్యూనిటీ భవనంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు

ఉండటంతో అసలు సమస్య వచ్చి పడుతోంది. ప్రతిరోజూ పాఠశాలలకు వెళ్లి క్లీన్ చేయడం కష్టంగా మారింది. పాఠశాల గదులన్నీ దుమ్ముతో నిండుతున్నాయి. అంతే కాకుండా క్లీనింగ్ చేసేందుకు వెళ్తున్న పారిశుధ్య కార్మికులు కేవలం పాఠశాల ఆవరణను ఊడ్చి వెళ్తున్నారు. దీంతో తరగతి గదులు అపరిశుభ్రతతో ఉంటున్నాయి.

మా ఊరు బడిని పట్టించుకోవడం లేదు



మా ఊరు పాఠశాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. గత ఐదేళ్ల నుంచి పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే పాఠశాలలో వరద నీరు చేరుతోంది. ఈ పరిస్థితి రెండేళ్లుగా ఎక్కువ కావడంతో గ్రామ పెద్దలు మాట్లాడి పంచాయతీ కార్యాలయంలో స్కూలు ఏర్పాటు చేయించారు. కొద్ది రోజుల క్రితం అధికారులు అంగన్‌వాడీ భవనంలోకి మార్చారు. వసతులు లేక పిల్లలంతా ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్నారు.

మహమ్మద్ శఫీ, దేవరంపల్లి గ్రామస్తుడు

కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలి



శిథిలావస్థకు చేరిన మాఊరు పాఠశాలను డిస్మెంటల్ చేసి అదే స్థలంలో కొత్త భవనాన్ని మంజూరు చేయాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి. మాఊరు మండలానికి చాలా దూరంలో ఉండటంతో ఉన్నతాధికారులు ఎవరూ ఇక్కడికి రావడం లేదు. పర్యవేక్షణ కొరవడింది.

మాణిక్యరెడ్డి, దేవరంపల్లి

మా బాబును ప్రైవేట్‌కు మార్చాను



ప్రభుత్వ పాఠశాలలో నా కొడుకును 5వ తరగతి వరకు చదివించాను. ప్రభుత్వ బడుల తీరు నచ్చక ప్రైవేట్‌లో చేర్పించాను. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయడం లేదు. ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. పిల్లలను పట్టించుకోవడం లేదు.

ఎల్గని నరేష్‌గౌడ్, హిమాయత్‌నగర్, మొయినాబాద్ మండలం


ఆర్‌అండ్‌బీ అతిథిగృహ నిర్మాణానికి మంత్రి హామీ

- రూ. 4.40 కోట్ల మంజూరుకు అంగీకారం
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 19: షాద్‌నగర్ ఆర్‌అండ్‌బీ అతిథిగృహ నూతన భవన నిర్మాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతి పత్రాన్ని ఇచ్చినట్లు పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో స్వాతంత్ర్యానికి పూర్వం నిర్మించిన అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. అతిథిగృహ నిర్మాణానికి రూ.4.40 కోట్లు, ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.80 లక్షల రూపాయల మంజూరుకు మంత్రి అంగీకారం తెలిపారని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి, సాగునీటి సమస్యను శాశ్వతంగా నిర్మూలించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చినట్లు ఎమ్మెల్యే శంకర్ తెలిపారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి : వీర్లపల్లి

పాడిపరిశ్రమాభివృద్ధి కోసం అసెంబ్లీలో ప్రస్తావించి, సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కాసాన్‌పల్లి శివారులో ప్రారంభోత్సవానికి నోచుకోని ఘనీకృత వీర్యనాళికల ఉత్పత్తి కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణాలకే పరిమితమైన కేంద్రం పరిస్థితిని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రం ప్రారంభమైతే ప్రతీ యేటా 11 లక్షల వీర్య నాళికలను ఉత్పత్తి చేసి, పాడి రైతులకు పంపిణీతో పాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయవచ్చని వివరించారు. అలాగే షాద్‌నగర్‌లో పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయ పునఃరుద్ధరణకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అసెంబ్లీలో ప్రస్తావించి, సమస్యలను పరిష్కరిస్తానన్నారు.



మంత్రి కోమటి వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బట్టు లలిత రమేశ్

ఆర్టీసీ స్థలంలో చిరు వ్యాపారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మర్పల్లి, జూన్ 19: ఆర్టీసీ స్థలంలో ఖాళీచేయించిన చిరు వ్యాపారులకు ఆర్టీసీ నిర్మించే దుకాణ సముదాయాల్లో ప్రాధాన్యం కల్పించాలని ఎంపీపీ బట్టు లలితరమేశ్ అన్నారు. బుధవారం మర్పల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొన్ని రోజులుగా చిన్న వానొచ్చినా గంటల తరబడి విద్యుత్ ఉండడం లేదని విద్యుత్ అధికారులను సభ్యులు నిలదీశారు. తీగలు తెగి సమస్యలొస్తున్నాయని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం వచ్చే నెల రైతు భరోసా డబ్బులు విడుదల చేస్తుందని ఏవో వసంత తెలిపారు. భగీరథ పైపులైన్ల లీకేజీలతో నీటి సమస్య ఏర్పడుతోందని, మరమ్మతులు చేయాలని అధికారులకు తెలిపారు. బస్టాండ్ స్థలంలో చిరువ్యాపారుల షెడ్లను వారం రోజుల కింద ఖాళీ చేయించగా పేదలు రోడ్డున పడ్డారని, దుకాణాల్లో వారికి ప్రాధాన్యత కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని జడ్పీటీసీ మధుకర్, ఎంపీపీ హెచ్చరించారు. వచ్చే నెల 5న మండల పరిషత్ పదవీకాలం ముగియడంతో ఇదే చివరి సమావేశం అన్నారు. ఐదేళ్లు సహకరించిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలకు ధన్యవాదాలు తెలిపారు. రూ.20కోట్లకుపైగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పాఠశాల భవనాలు నిర్మించామన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సొహైల్, ఎంపీడీవో రాజమల్లయ్య, తహసీల్దార్ గణేశ్, ఎంపీవో సుశీల్‌కుమార్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలుస్తా

మేడ్చల్ టౌన్, జూన్ 19: ఈవీఎల్ పరిశ్రమ కార్మికులకు అండగా నిలుస్తానని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఈవీఎల్ పరిశ్రమ కార్మికులతో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈవీఎల్ కార్మికులు యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. వేతనాల పెంపు విషయంలో యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేకూరుస్తానన్నారు. కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకులు శంభుప్రభాకర్, రమేష్, నరసింహా చారి, రాజయ్య, సిరాజుద్దీన్, రాముడుయాదవ్, నాయకులు ఎస్.మోమన్ రెడ్డి, సందీప్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

సాంకేతిక రంగంలో విద్యార్థులు రాణించాలి

మేడ్చల్ టౌన్, జూన్ 19: ఇంజనీర్లు సాంకేతిక రంగంలో రాణించి ప్రపంచానికి ఉపయోగపడే ఆవిష్కరణలను కనుగొనాలని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో కేంబ్రిడ్జ్ ఇంగ్లీష్ సి-1 లెవల్, సిస్కో సి సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు అవార్డుల ప్రదానం చేశారు. ముఖ్య అతిథి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతికరంగంలో చోటుచేసుకుంటున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా మారాలన్నారు. పరిశోధనల పట్ల ఆసక్తి చూపాలన్నారు. నిత్యం కొత్త ఆలోచనలతో ముందుకుసాగాలని సూచించారు. సాంకేతిక పరమైన ఆలోచన విధానాన్ని కార్యరూపంలోని తెచ్చేది ఇంజనీర్లు మాత్రమే అన్నారు. బ్రెస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్ట్రాటజిక్ అడ్వైజర్ బి.తేజారావు మాట్లాడుతూ ప్రపంచానికి ఉపయోగపడే ఆవిష్కరణలను కనుగొని ఇంజనీర్లు గొప్పస్థాయికి ఎదగాలన్నారు. కళాశాల కార్యదర్శి మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవీలత పాల్గొన్నారు.



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఆలయంలో ప్రత్యేక పూజలు

కులకచర్ల, జూన్ 19: చౌడాపూర్ మండలంలోని మక్త వెంకటాపూర్ గ్రామంలోని భవానీ మాత ఆలయంలో బుధవారం తహసీల్దార్ ప్రభు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ మాత ఉత్సవాల్లో భాగంగా ఆయన ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఆర్ఐ లింగయ్య, స్థానికులు వెంకట్, అంజు తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రభు

ప్రజాపాలన కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలి


ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ మంజుల

వికారాబాద్, జూన్ 19 : ఉచిత కరెంటు(జీరో బిల్లు) రానివారు ప్రజాపాలన సేవాకేంద్రం కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, అక్కడ జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్ అన్నారు. అర్హులైనా జీరో కరెంటుబిల్లు రాని వారు దరఖాస్తు చేసుకునేందుకు చైర్‌పర్సన్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన సేవాకేంద్రం కౌంటర్‌ను బుధవారం ప్రారంభించారు. పూర్తి వివరాలతో కౌం టర్లో దరఖాస్తు చేసుకుంటే సమస్యకు పరిష్కారం చూపుతారని తెలిపారు. వికారాబాద్ పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జకీర్ అహ్మద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్ : సమస్యలు పరిష్కరించుకునేందుకు ప్రజలు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని తాండూరు ఎంపీపీ అనితాగౌడ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గృహజ్యోతి కింద జీరో బిల్లులు వస్తుందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పొందవచ్చన్నారు. జీరో బిల్లు రాని వారు ప్రజాపాలన సేవాకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్, సిబ్బంది నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తాండూరులో ప్రజాపాలన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ప్రతి కాలనీకి సీసీ రోడ్డు తప్పనిసరి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మర్రి దీపిక

మేడ్చల్ టౌన్, జూన్ 19: మేడ్చల్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో సీసీ రోడ్లను నిర్మిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం 14వ వార్డులో రూ.10లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 23వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. నిధులు ఇచ్చిన చైర్ పర్సన్‌కు కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ 'కొండా'కు పౌర సన్మానం

వికారాబాద్, జూన్ 19: చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి వికారాబాద్ బీజేపీ నాయకులు బుధవారం పౌరసన్మానం నిర్వహించారు. మొదట పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించారు. ఎంపీ కొద్దిసేపు వారితో గడిపి చేవెళ్లలో ఓ బీజేపీ నాయకుడు చనిపోయాడనే సమాచారం రావడంతో వెళ్లిపోయారు. పౌరసన్మానం అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మ చెరువు శుభ్రంచేసే పనులు ప్రారంభం


చెరువు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

మేడ్చల్ టౌన్, జూన్ 19 : వర్షాకాలం రావడంతో మేడ్చల్‌లోని తుమ్మ చెరువును శుభ్రం చేసే పనులను మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. బుధవారం కమిషనర్ నాగిరెడ్డి పనులను పర్యవేక్షించారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఈ చెరువులో వ్యర్థాలు పారేయడం, గుట్టలుగా చెత్తను డంప్ చేయడంతో చెరువు నీరు కలుషితమైంది. అలాగే చెరువు పరిసరాలు మురికిమయమయ్యాయి. వర్షాకాలంలో చెరువు మరింత మురుగుగా మారే ఆస్కారం ఉన్నందున ఇప్పుడే చెరువులో పేరుకున్న వ్యర్థాలను తొలగిస్తున్నామని కమిషనర్ తెలిపారు. వానకాలంలో చెరువులోకి నీరొస్తే కలుషితం కాకుండా ఉంటుందన్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలుస్తాం

పరిగి,జూన్ 19: పేద విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా ఆసరగా నిలుస్తామని మధునాపంతులు ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి.కిర్తీరాజు కిరణ్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో రూ.15లక్షలతో నిర్మించిన టాయిలెంట్లను ఎంపీపీ అరవింద్‌రావు, ఎంఈవో హరిశ్చందర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. సంపాదించిన దాంట్లో కొంత సేవచేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. సంస్థ ప్రతినిధులను ఎంపీపీ, ఎంఈవోలు అభినందించారు. హెచ్ఎం సుభాష్, సంస్థ ప్రతినిధులు రామకృష్ణరాజు, విజయ్,సుభాష్, జగన్నాథరావు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


పరిగిలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్ టౌన్/ పరిగి, జూన్ 19 : కాంగ్రెస్ పార్టీ ఎంపీ, జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ 51వ జన్మదిన వేడుకలను బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఘట్‌కేసర్ మండలం ఘనపురం పవర్‌గ్రిడ్ వద్ద ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ బి-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. నాయకులు వేముల రాజుగౌడ్, గోపాల్‌రెడ్డి, సత్తయ్యగౌడ్, పరమేష్‌గౌడ్, వేముల గోవర్ధన్‌గౌడ్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, పాల్గొన్నారు. అలాగే మేడ్చల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంచారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, వేముల శ్రీనివాస్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, లాయక్‌అలీ పాల్గొన్నారు. పరిగిలో కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, డీసీసీ కార్యదర్శి ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజల మనోభావాలకనుగుణంగా కాంగ్రెస్ నడుచుకుంటుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ రాష్ట్ర కార్యదర్శి అంజనేయులు, తావుర్యానాయక్, మల్లేశ్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో రాహుల్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావనిజంగయ్యయాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి పేరు తెచ్చే బాధ్యత కాంగ్రెస్ శ్రేణులదేనన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ఘన స్వాగతం

శామీర్‌పేట, జూన్ 19 : కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం మొదటిసారి శామీర్‌పేటకు వచ్చిన సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సంజయ్ హైదారాబాద్ నుంచి కరీంనగర్‌కు కాన్వాయ్‌గా వెళ్తూ శామీర్‌పేట మండలం మురహరిపల్లి చౌరస్తాలోని బృందావన్ గ్రాండ్ హోటల్ వద్ద కాసేపు ఆగారు. అక్కడ బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు మంత్రికి పుష్పగుచ్ఛాలనిచ్చి సన్మానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు కైర యాదగిరి, నాయకులు వంగరి హృదయ్‌కుమార్, బుద్ధి శ్రీనివాస్, పవన్‌గౌడ్, మైసయ్య, శివ, సాయిగౌడ్, తదితరులు పెద్దఎత్తున బండి సంజయ్‌కు గజమాల వేసి ఘన స్వాగతం పలికారు.


కేంద్ర మంత్రి సంజయ్‌ని శాలువాతో సత్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి

రైతులకు అందుబాటులో ఎరువులు

పూడూరు, జూన్ 19 : దేవనోనిగూడెం రైతు సేవా సంఘంలో ఎరువులు అందుబాటులో ఉంచారు. సైబేజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ ఎరువులను బుధవారం తరలించారు. కార్యక్రమంలో సైబేజ్ కంపెనీ ప్రతినిధు లు సురేష్‌కుమార్, సీతారాంరెడ్డి, మాజీ సర్పంచ్ బిచ్చయ్య, అధ్యక్షుడు చిన్న నారాయణ, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, కోశాధికారి పి.విశ్వనాథం, ఎం.అంజయ్య, యు.నర్సింహులు, పెద్దనారాయణ, పాండు, భాస్కర్ ఉన్నారు.



దేవనోనిగూడెంకు తెచ్చిన ఎరువులు

స్పీకర్, ఎమ్మెల్యేలను కలిసిన ఏఎంసీ చైర్మన్

బంట్వారం(కోట్‌పల్లి), జూన్ 19: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని బుధవారం వారి నివాసాల్లో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ నారాయణరెడ్డిలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, అలాగే మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి రావాలని కోరామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బందయ్య, రమేష్, అక్బర్ తదితరులు ఉన్నారు.


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య

బోనఫైడ్ తీసిన పాపానికి విద్యార్థిని అనుమతించని హెచ్ఎం

● ఎంఈవోకు తండ్రి ఫిర్యాదు


కొడుకు శరత్‌తో రాములు

తాండూరు రూరల్, జూన్ 19 : ఓ పక్క బడిబాట అంటూ బడీడు పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఓ హెచ్ఎం మాత్రం విద్యార్థిని స్కూలు నుంచి పంపించే యత్నం చేశాడు. సర్టిఫికెట్ల కోసం తండ్రి తన కుమారుడి బోనఫైడ్ తీసుకెళ్లిన పాపానికి ఆ విద్యార్థి పేరును పాఠశాల రిజిష్టర్ నుంచి తొలగించారు. దీంతో విద్యార్థి తండ్రి బుధవారం ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఉద్దండాపూర్‌నకు చెందిన బుడగజంగం రాములు కుమారుడు శరత్ ఉద్దండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. రాములు తన కొడుకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు తీసేందుకు ఐదు రోజుల క్రితం బోనఫైడ్ తీసుకెళ్లాడు. శరత్ బుధవారం పాఠశాలకు వెళ్లగా హెచ్ఎం రవీందర్‌కుమార్‌శర్మ.. 'మీ నాన్న నీ బోనఫైడ్ తీసుకెళ్లాడు. నువ్వు స్కూలుకు రావొద్దు. ఇంటికి వెళ్లు.' అని ఆదేశించారు. దీంతో శరత్ ఏడుస్తూ ఇంటికి వెళ్లి విషయం తండ్రికి చెప్పాడు. దీంతో రాములు పాఠశాలకు వచ్చి హెచ్ఎంతో మాట్లాడాడు. నేను టీసీ తీసుకోలేదు కదా? ఎందుకు అనుమతించరని అడిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. శరత్‌ను పాఠశాలలో అనుమతించనని హెచ్ఎం అన్నాడు. దీంతో రాములు ఎంఈవో వెంకటయ్యకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎంఈవోను స్పందిస్తూ.. ఉద్దండాపూర్ పాఠశాలలో జరిగిన సంఘటన తన దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి, విద్యార్థి పాఠశాలలో చదుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు.

టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జిని కలిసిన నాయకులు

ఘట్‌కేసర్, జూన్ 19: మల్కాజిగిరి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కందికంటి అశోక్‌గౌడ్‌ను బుధవారం మేడ్చల్ నియోజకవర్గ టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని అశోక్‌గౌడ్ నివాసంలో కలిసిన టీడీపీ నాయకులు ఆయనను సత్కరించారు. అనంతరం పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిపారు. మండల, మున్సిపాలిటీ, గ్రామస్థాయిలో ఉన్న నాయకులను కలిసి చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వివిధ పార్టీల నాయకులు టీడీపీ వైపు చూస్తున్నారని, పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు నాయకులు వివరించారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్, పార్టీ మండల అధ్యక్షుడు సంజీవగౌడ్, నాగారం మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు కృష్ణారావు, నాయకులు సామాల జగన్‌మోహన్‌రెడ్డి, మహేష్, పాటి సురేందర్‌రెడ్డి, ఉమాశంకర్, బ్రహ్మం, రాము పాల్గొన్నారు.

పరిగి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

పరిగి,జూన్ 19: పరిగి పట్టణాన్ని పరిశుభ్రతగా ఉంచాలని మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, కమిషనర్ వెంకటయ్య అన్నారు. బుధవారం ఉదయం ఐదు గంటలకే కార్యాలయంలో కార్మికుల హాజరును తీసుకున్నారు. వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ ఉదయం ఐదు గంటలకే విధులకు హాజరు కావాలని సూచించారు.

కొందరికే 'గృహజ్యోతి'

● బషీరాబద్ కరెంట్ జీరో బిల్లులకు ఎంపిక కాని వారు 2,439 మంది

బషీరాబాద్, జూన్ 19: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం అందరికీ అందడం లేదు. తెల్లరేషన్ కార్డు ఉండి నెలకు 200యూనిట్లలోపు కరెంటు వినియోగించే వారు ఈ పథకానికి అర్హులు. బషీరాబాద్ మండలంలో గృహ విద్యుత్ వినియోగదారులు 6,930 మంది ఉండగా వీరిలో 4,491 మందిని గృహజ్యోతి పథకానికి ఎంపిక చేశారు. ఫిబ్రవరి నుంచే అమలు చేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్‌తో అమలు కాలేదు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో అందరికీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్నాం

గృహజ్యోతి పథకానికి ఎంపికకాని అర్హుల నుంచి మరోసారి ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మొదట ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తుకు సంబంధించిన రశీదు తీసుకెళ్లి చూపిస్తే మరోసారి దరఖాస్తు ఇస్తారు. అందులో యజమాని పేరు, విద్యుత్ మీటరు సర్వీస్ నంబరు, రేషన్‌కార్డు నంబర్‌ను నింపాలి. రశీదు విద్యుత్ అధికారులకు ఇస్తే అర్హులకు జీరో బిల్లుకోసం అప్‌లోడ్ చేస్తామని ట్రాన్స్‌కో ఏఈ మోహనక్రిష్ణారెడ్డి తెలిపారు.

తాండూరులో ఆర్భాటంగా హిందూ సామ్రాట్ దినోత్సవం

తాండూరు, జూన్ 19:హిందూ సామ్రాట్ దినోత్సవాన్ని బుధవారం శివాజీ యోజన సంఘం ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. హిందూ ధర్మ రక్షణ కోసం శివాజీ మహారాజ్ ఎదురు లేని పోరాటాలు చేశారని ఈ సందర్భంగా గ్రామస్తులు కొనియడారు. కార్యక్రమంలో ప్రతినిధులు కృష్ణ ముదిరాజ్, బంట్వారం భద్రేశ్వర్, నాగారం మల్లేశం, గోపాల్, కందనెల్లి సంగమేశ్వర్, కృష్ణ, సత్యమూర్తి, శివకుమార్, కిరణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

పల్లవి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో యువ క్రీడోత్సవాలు

కీసర రూరల్, జూన్ 19 : క్రీడలు విద్యార్థుల్లో కృషి, పట్టుదలను పెంపొందిస్తాయని పల్లవి ఇంటర్‌నేషనల్ స్కూల్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో గల పల్లవి ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో యువ క్రీడోత్సవాలు నిర్వహించారు. పోటీల్లో కీసర, బోయిన్‌పల్లి, బోడుప్పల్, తిరుమల్‌గిరి, అక్షర మార్గ్వే, గండిపేట, సరూర్‌నగర్‌లోని పల్లవి గ్రూప్ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదర్భంగా లాంగ్ జంప్, 50 నుంచి 1500మీటర్ల పరుగు పందెం, జావలిన్ త్రో, డిస్క్ త్రో, షాట్‌పుట్, ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలత చన్నాప్రగడ, వైస్‌ప్రిన్సిపల్ వైష్ణవి, అకడమిక్ ప్రైమరీ ఇన్‌చార్జి జయమణి, మాళవిక, పీఈటీలు, విభాగ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జూన్ 19 : అధిక ధరలకు పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేటు కార్పొరేట్ స్కూల్‌లో పుస్తకాలు అమ్ముతున్నారని సమాచారంతో అక్కడికి వెళ్లి పట్టుకొని విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ ఒకేతాటిపై నిలబడాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేష్, సంయుక్త కార్యదర్శి జగదీశ్, అనిల్, ఆది కేశవ్, రాజేందర్, మురళి, అక్షిత్, సునిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనీమియా వ్యాధి నివారణకు కృషిచేయాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మేడ్చల్ టౌన్, జూన్ 19: ప్రతీ సంవత్సరం లక్షలాది మంది ప్రాణాలను బలిగొంటున్న అనీమియా వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అనీమియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం మేడ్చల్‌లోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ వ్యాధి వంశపారపర్యంగా వస్తుందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి రోగ లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్సచేస్తే వ్యాధి బారినపడకుండా కాపాడొచ్చన్నారు. పిల్లల్లో ఈ వ్యాధి సంక్రమించకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

చైతన్యనగర్‌లో అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

పెద్దేముల్, జూన్ 19: చైతన్యనగర్‌లో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెద్దేముల్ మండలం చైతన్యనగర్ గ్రామంలో ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ సికిల్ సెల్ అనీమియా ఎలిమేషన్ మిషన్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చెంచులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వాన్‌కుమార్, గిరిజన సంక్షేమ అధికారిమల్లేశం, పీహెచ్‌సీ వైద్యులు బుచ్చిబాబు తదితరులు హాజరయ్యారు.

పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, జూన్ 19: తూంకుంట మున్సిపాలిటీ ఉప్పరిపల్లి పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. మెదక్‌కు చెందిన గుండు నారాయణ-లక్ష్మి దంతపలు, కుమారడు రాజు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్ రూరల్:** కొడంగల్ మండలంలోని ఆశమ్మకుంట తండా పాఠశాలలో బుధవారం యువ 24 ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్‌లు, బ్యాగులు, ప్లేట్లు, పెన్నులు, వాటర్ బాటిళ్లు, ఫ్లోర్ నైట్ అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేశ్‌గౌడ్, కలారి రమేశ్, కృష్ణయాదవ్, రామయ్యగౌడ్, వెంకట్, నగేశ్, దేవ్ మహారాజ్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

● **వికారాబాద్:** జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలెబుల్ స్కీమ్ కింద ఇంగ్లీష్ మీడియం 5వతరగతి(రెసిడెన్షియల్)లో చేరేందుకు రెండవ దఫా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి మల్లేశం తెలిపారు. జిల్లాలో 5వ తరగతిలో(రెసిడెన్షియల్) 91 సీట్లకుగాను మొదటి విడతలో 23సీట్లు భర్తీ అయ్యాయని, మిగిలిన 68 సీట్లకు దరఖాస్తులను ఎస్సీ విద్యార్థినీ విద్యార్థులు ఈ నెల 26లోపు కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

● **వికారాబాద్:** టీజీ పాలిసెట్ 2024లో అర్హత పొంది పాలిటెక్నిక్ కోర్సుల్లో అడ్మిషన్ పొందగోరే విద్యార్థులు ఈ నెల 23 నుంచి 25 తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ ఎం.పరమేశ్వర్ తెలిపారు. స్లాట్లను జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు రిజిష్టరు చేసుకోవచ్చన్నారు. ధ్రువ పత్రాల పరిశీలనకు ఎస్సెస్సీ ఒరిజినల్ మెమో, స్కూల్ బోనఫైడ్, టీసీ, కుల, ఆదాయ సర్టిఫికెట్లు, ఆధార్ మొదలగు పత్రాలు ఒరిజినల్‌తో పాటు ప్రతీది రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** కొద్ది సంవత్సరాలుగా మేడ్చల్ పట్టణ అత్వెల్లి నారెడ్డి నందారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన రామారావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానికులు రామారావు దంపతులను పాఠశాలలో సన్మానించారు. అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థుల కోసం ఆయన ఎనలేని సేవలందించారని స్థానికులన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

● **ధారూరు:** ధారూరులోని హనుమాన్ ఆలయంలో ప్రథమ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. విగ్రహాలకు అభిషేకం, అలంకరణ చేసి, హారతినిచ్చి నైవేద్యం సమర్పించారు. హోమ పూజల్లో దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను పూజారులు చెన్న బసవయ్య, కుమారస్వామి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● **తాండూరు రూరల్:** తాండూరు మండలం అంతారంతండాలో అమ్మ ఆదర్శ పాఠశాలను ఎంపీడీవో విశ్వప్రసాద్ సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, డ్రెస్సులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా పనిచేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ అధికారి రతన్‌సింగ్, కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు నర్సింహులు ఉన్నారు.

● **పూడూరు:** మన్నెగూడ పంచాయతీలో ప్రతి మంగళవారం జరిగే సంత(తైబజార్) వేలం ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి ముగిసింది. 2024-25వ సంవత్సరానికి ఈ నెల 26వ తేదీన గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీలో రూ.10వేలు డిపాజిట్ చేసి తైబజార్ వేలంలో పాల్గొనాలని అన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని కేపీఆర్ఐటీ డైరెక్టర్ దివ్యశ్రీ అన్నారు. ఘణపూర్‌లోని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇంజినీరింగ్ అటనమస్ కళాశాలలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై గ్రేడియస్ టెక్నాలజీ సంస్థతో ఒప్పందరం కుదుర్చుకున్నారు. విద్యార్థులు నైపుణ్యం ప్రదర్శించినప్పుడు ఉపాధి లభిస్తుందన్నారు. గ్రేడియస్ సంస్థ వ్యవస్థాపకుడు మధుసూదన్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ విద్యనభ్యసించిన విద్యార్థులందరికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే సంస్థను స్థాపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు, డీన్ ప్రొఫెసర్ సోమినిరాయ్, బోధనాసిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


● **కులకచర్ల:** చౌడాపూర్ మండలం మరికల్ గ్రామ నూతన కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా శివకుఆర్, ఉపాధ్యక్షుడు గణేశ్, రాజేశ్, కార్యదర్శి జహంగీర్, చెన్నయ్య, సలహాదారులు నరేందర్‌ప్రసాద్, నర్సిములు, రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు రామ్మోహన్‌శర్మ, నరేందర్ ప్రసాద్, కృష్ణాజీ, నర్సింహా, పాండు పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** ఈ నెల 20న(నేడు) జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా 19 సంవత్సరాలు నిండిన బాలబాలికలకు అందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తామని వైద్యాధికారి సుజల తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు మాత్రలు వేసుకోవాలని తెలిపారు. గురువారం వేసుకోని విద్యార్థులకు 27న మాత్రలు వేస్తామన్నారు. వ్యాధులు ఉన్నవారు వైద్యులను సంప్రదించి మాత్రలు వేసుకోవాలని తెలిపారు.

క్రైం కార్నర్

బైక్ దొంగల అరెస్ట్

● హ్యాండిల్ లాక్ లేని బైక్‌లే టార్గెట్ ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్, జూన్ 19 : జల్సాలకు అలవాటుపడిన నలుగురు యువకులు బైక్‌ల చోరీని ఎంచుకున్నారు. హ్యాండిల్ లాక్ లేని బైకులను అపహరించారు. పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ కాశీనాథ్‌లు బుధవారం వెల్లడించారు. తాండూరులోని గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన అడిగొల్ల వంశీకృష్ణాగౌడ్, అలియాస్ అభినందన్(20), అంతారానికి చెందిన బొడ్డె జస్వంత్ అలియాస్ జానీ, మరోఇద్దరు మైనర్లు కలిసి బైక్‌లు చోరీ చేశారు. 20 రోజుల క్రితం హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో రెండు పల్సర్ బైక్‌లు, 15రోజుల క్రితం యాలాల మండలం పరిధి లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా వద్ద హీరోహోండా స్పెండర్ ప్లస్, మిత్రానగర్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్, పది రోజుల క్రితం వికారాబాద్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకులను చోరీచేశారు. ఈ బైకులను వారి ఇళ్లవద్ద ఉంచుకొని తిప్పుతున్నారని డీఎస్పీ వివరించారు.

ఇలా దొరికారు ...

తాండూరులోని ఇందిరాచౌరస్తా సమీపంలోని మినార్ టీ పాయింట్ వద్ద సోమవారం మధ్యాహ్నం తన బైక్ పోయిందని బంట్వారం మండలం కల్ములందుకు చెందిన బోయిని సత్యనారాయణ తాండూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం ఎస్ఐ కాశీనాథ్ విలియం మూన్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. అక్కడికి బైక్‌పై వచ్చిన వంశీకృష్ణగౌడ్, జస్వంత్‌లను బైక్ కాగితాలు చూపమనగా చూపించలేదు. వారిని విచారించగా చౌరస్తా వద్ద బైక్‌ను అపహరించామని ఒప్పుకున్నారు. వారిని మరింత విచారించగా.. మొత్తం ఐదు బైకులను దొంగిలించినట్లు చెప్పారు. హ్యాండిల్ లాక్ లేని బైకులకే చోరీ చేసినట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉండగా వారిని జువైనల్ హోమ్‌కు, వంశీకృష్ణగౌడ్, జస్వంత్‌లను రిమాండ్‌కు తరలించామన్నారు. కేసు ఛేదించిన ఎస్సైలు కాశీనాథ్, రాములు, హెడ్‌కానిస్టేబుళ్లు రామకృష్ణ, అంజద్, కానిస్టేబుళ్లు శివకుమార్, సాయప్ప, షబ్బీర్‌లను డీఎస్పీ అభినందించారు.

ఇంటి ముందు పార్క్‌చేసిన ఆటో చోరీ


ఘట్‌కేసర్ రూరల్, జూన్ 19 : ఇంటి ముందు పార్క్‌చేసిన ఆటోను దుండగులు అపహరించిన సంఘటన మండలంలో బుధవారం సాయంత్రం చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బోక్కోనిగూడకు చెందిన బచ్చు మహేష్‌కుమార్ తన ప్యాసింజర్(టీఎస్10యూఏ 0792) ఆటోను మంగళవారం రాత్రి పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం ఆటో లేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్-కారు ఢీ.. పలువురికి గాయాలు

మోమిన్‌పేట్, జూన్ 19: బైక్-కారు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన మొరంగపల్లి శివారులోని మూలమలుపు ఎల్లమ్మ ఆలయం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఎన్కెపల్లికి చెందిన గొల్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి కుమార్తెను వికారాబాద్‌లో హస్టల్‌లో చేర్పించేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. వెల్చాల్‌కు చెందిన భార్యాభర్తలు పరమేశ్, మాధవి, కుమారుడు మనీతేజ్‌తో కలిసి మోమిన్‌పేట్‌లో శుభకార్యం నిమిత్తం కారులో వస్తుండగా కారు-బైక్ ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలు కాగా, కుమారుడికి రెండు కాళ్లు విరిగాయి. కారులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు 108 వాహన సిబ్బంది తెలిపారు.

యువకుడు అదృశ్యం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 19 : ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు చెందిన బత్తిని శ్రీకాంత్‌గౌడ్(28) ఘట్‌కేసర్‌లోని సబ్‌రిజిష్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 15 ఆఫీస్‌కని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతడి తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


శ్రీకాంత్‌గౌడ్